## క్లుప్తంగా

### రేపు తర్తూరులో ప్రతిష్ఠోత్సవాలు


నూతనంగా నిర్మించిన ఆలయం

**జూపాడుబంగ్లా:** మండలంలోని తర్తూరు గ్రామంలో ఈనెల 30న విఘ్నేశ్వర, శివపార్వతులు, సుబ్రహ్మణ్యేశ్వర, నందీశ్వర, స్వామి వార్లతో పాటు నూతనంగా నిర్మించిన చౌడమ్మ, సవారమ్మ, సుంకులమ్మ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయన్నారు. మొదటి రోజు అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ గణపతిపూజ, రక్షాబంధం, పంచగవ్య ప్రాసన, గోపూజ, షోడేశస్తంభ ప్రతిష్ఠాపన, కలశపూజ, జలాదివాసం తదితర పూజలు నిర్వహించి మహామంగళహారతి ఇచ్చారు.

### తగ్గిన భక్తుల రద్దీ


కామేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

**మహానంది:** కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య బుధవారం తగ్గింది. పలు ప్రాంతాలకు చెందిన కొద్దిపాటి భక్తులు ఆలయానికి చేరుకుని కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని, పూజలు చేపట్టారు.

### వైభవంగా గోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

**వెలుగోడు:** గుంతకందాల గ్రామంలో బుధవారం గోపాల స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోపాలస్వామి, గరుత్మంతుడు, వినాయక స్వామి విగ్రహాలను వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా నంద్యాల బ్లడ్ బ్యాంక్ కమిటీ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం, నంద్యాల డాన్స్ మాస్టర్ మానస, టీచర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నత్యం ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్ పాల్గొన్నారు.

### నేడు మల్లన్నకు స్వర్ణరథోత్సవం

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు దేవస్థాన అధికారులు స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. వేకువ జామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు అర్చకులు జరిపిస్తారు. ఆలయ మహాద్వారం ముందుభాగం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవాన్ని జరిపిస్తారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యప్రదర్శనలో కళాకారులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శారదా కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, లింగాష్టకం, జ్యోతిర్లింగాకారా, శివస్తుతి, దేవీస్తుతి, పార్వతీవల్లభాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు జ్ఞానశ్రీ, ప్రసన్న, ఆద్యశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

### రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

**పాములపాడు:** మండల కేంద్రంలో ఈనెల 30 నుంచి ఐకాన్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్, అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ప్రవేశ రుసుం రూ.600 చెల్లించి తమ జట్ల పేర్లను ఈనెల 29లోపు నమోదు చేయించుకోవాలన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్టుకు వరుసగా రూ.30,000, రూ.20,000, రూ.10,000 చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9642069665, 7993008692 నంబర్లను సంప్రదించాలన్నారు.

# బ్రిడ్జీలకు గ్రహణం

- అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు
- శిథిలావస్థకు చేరిన బ్రిడ్జీలపైనే రాకపోకలు
- పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు


అసంపూర్తిగా మిగిలిపోయిన పాత ముచ్చుమర్రి బ్రిడ్జీ


పగిడ్యాలలో పిల్లర్స్‌తో మిగిలిపోయిన డబుల్ లైన్ బ్రిడ్జీ పనులు

**పగిడ్యాల:** మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల్లో కేసీ కాలువపై నిర్మిస్తున్న డబల్ లైన్ బ్రిడ్జీల పనులకు గ్రహణం పట్టుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభంకాగా.. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత కూటమి ప్రభుత్వం రావడంతో పనులు పునఃప్రారంభం కాలేదు. దీంతో బ్రిడ్జీలు అసంపూర్తిగా మిగిలాయి.

**రూ.2కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం**

పాత ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల్లో కేసీ కాలువపై శిథిలావస్థకు చేరుకున్న పాత బ్రిడ్జీలపై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండటంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. రెండు కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించి పిల్లర్లు పూర్తి చేసి ఫ్లాట్ ఫాం పనులు కూడా కొంత భాగం పూర్తి చేశారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ ఎన్నికల్లో గెలుపొందిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

**కాంట్రాక్టర్‌లకు నోటీసులిచ్చాం**

బ్రిడ్జీల విషయమై కేసీ కెనాల్ నీటిపారుదల శాఖ ఏఈఈ వీరమ్మను సంప్రదించగా.. నెల రోజుల క్రితమే కాంట్రాక్టర్‌లకు ఉన్నతాధికారులు నోటీస్‌లు ఇచ్చారన్నారు. పనులు చేయమంటే బిల్లులు రాలేదని, అందుకే పనుల్లో జాప్యం జరుగుతోందని చెబుతున్నారని ఆమె తెలిపారు.

దాదాపు ఏడాది కాలం కావస్తున్న ఈ బ్రిడ్జీల పనులు కార్యరూపం దాల్చకపోవడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రమాదకరంగా బ్రిడ్జీలు**

పాత బ్రిడ్జీల ఫ్లాట్ ఫాం ఇనుప చువ్వలు బయట పడి పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. శిథిలావస్థకు చేరిన పాత బ్రిడ్జీల మీద ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం కేసీ కాలువకు నీటి సరఫరా నిలిచిపోయిందని, ఇప్పుడే పనులు చేసేందుకు అనువుగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. జూన్ మాసం రెండవ వారం నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని ఆగస్టు నెలలో కేసీ కాలువకు సాగునీరు విడుదల చేసే అవకాశం ఉందని పలువురు ఆయకట్టు రైతులు చర్చించుకుంటున్నారు. ఇప్పుడే బ్రిడ్జీల నిర్మాణం పూర్తచేస్తే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు.

### సాక్షి గణపతికి విశేషపూజలు



**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

### నేడు హుండీ కానుకల లెక్కింపు

**మహానంది:** మహానందిలో గురువారం హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వారితో పాటు కోదండ రామాలయం, వినాయక నంది ఆలయాలు, అన్నదానం, గో సంరక్షణ విభాగం హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నామన్నారు.

## కాశీవిశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


ప్రధాన కలశ స్థాపన పూజకు ఏర్పాటు చేసిన దృశ్యం

**కొత్తపల్లి:** మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర స్వామివార్ల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరుణపూజ, మాతృకాపూజనం, నాంది పూజ, రక్షా సూత్రధారణం, పంచగవ్య మేళన, ప్రోక్షణ, ప్రాశనం, ప్రధాన కలశ స్థాపన, నవగ్రహ, వాస్తు మండలారాధన, యంత్రాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం యాగశాల ప్రవేశం, అంకురార్పణ, గ్రామోత్సవం, అగ్ని ప్రతిష్ఠాపన, దీక్ష హోమం, జలాధివాసం, మంత్రపుష్పం, మంగళ హారతి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదం, ఆశీర్వచనం పూజలు నిర్వహించారు.

## వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన


చెంచులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

**ఆత్మకూరు:** వ్యక్తిగత పరిశుభ్రతపై చెంచులకు బుధవారం బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు గోపాల్, పవన్‌కుమార్ అవగాహన కల్పించారు. కిశోర బాలికలు రుతుక్రమంలో శానిటరీ ప్యాడ్స్‌ను 6 గంటలకు ఒకటి చొప్పున వాడాలని సూచించారు. ప్యాడ్స్ మార్చుకునే ముందు, మార్చుకున్న తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. తరచూ నీళ్లు తాగుతూ పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ దీపిక, హెల్త్ అసిస్టెంట్ బేబీజ్యోతి పాల్గొన్నారు.

## అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జగన్మోహన్


**బండి ఆత్మకూరు:** అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన ఎర్రగుంట్ల గ్రామంలో పర్యటించి ప్రజలకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తం ఉండాలని సూచించారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ముద్ర రుణాలు, ఇంటి నుంచే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆశ చూపి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. గుర్తుతెలియని నెంబర్ల నుంచి, ఐడీల నుంచి, సోషల్ మీడియాలో వచ్చే లింకులు ఓపెన్ చేయరాదన్నారు.

## చినుకు పడితే చిత్తడే!


బురద మయంగా ఉన్న ప్రధాన రహదారి

**పాములపాడు:** మండలంలోని చెలిమిల్ల గ్రామంలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు చిత్తడిగా మారాయి. బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు వేసిన అధికారులు డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీరు రహదారిపై నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ద్విచక్రవాహనదారులు సైతం బురదలో జారి కిందపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం


ఆర్టీసీ పార్శిల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎం గంగాధర్‌రావు

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణ ప్రజల సౌకర్యార్థం టెక్కె మార్కెట్ యార్డు ఎదురుగా ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను బుధవారం డిపో మేనేజర్ గంగాధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఇక్కడ పార్శిల్ బుకింగ్‌తో పాటు బస్సుల ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా చేయనున్నట్లు చెప్పారు. వివాహాది కార్యక్రమాలకు బస్సులను అద్దెకు సైతం ఇస్తామన్నారు. మరింత సమాచారం కోసం 6281892299, 9392850152 నంబర్లను సంప్రదించాలన్నారు.

## వందే భారత్ ట్రైన్‌ను డోన్‌లో ఆపాలి


డీఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీఐ నాయకులు

**డోన్ టౌన్:** హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే వందే భారత్ రైలు డోన్‌లో ఆపాలని(స్టాపింగ్) ఆర్పీఐ రాష్ట్ర నాయకులు హుసేనప్ప, ఎమ్మార్పీస్ నాయకులు భూమ నాగన్న బుధవారం గుంతకల్లు రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తకు వినతి పత్రం అందజేశారు. కర్నూలు వరకు వచ్చే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలును కూడా డోన్ వరకు పొడిగించాలని కోరారు. డోన్ రైల్వే జంక్షన్ కావడంతో ఇక్కడికి అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు డోన్ స్టేషన్‌కు తరలి వస్తుంటారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రైల్వేలో జరుగుతున్న సివిల్ పనులను సివిల్ ఇంజినీరింగ్ చేసిన నిరుద్యోగులకు నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు.

## నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**కర్నూలు (టౌన్):** ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాటుసారా తయారీదారులపై బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కల్లూరు మండలం కొల్లంపల్లి తాండాలో దాడులు నిర్వహించి 1,325 లీటర్ల నాటుసారాకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే చెన్నమ్మ సర్కిల్ వద్ద దాడులు నిర్వహించి 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక మీదట ప్రతినిత్యం దాడులు నిర్వహిస్తామన్నారు. పదేపదే ఇలాంటి కేసులు నమోదైతే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయ భూములకు రేపు బహిరంగ వేలం

**బండి ఆత్మకూరు:** మండల కేంద్రంలోని జనార్దన స్వామి ఆలయ భూములకు ఈనెల 30న బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన 17 ఎకరాల భూమిని ఏడాది కాల వ్యవధికి కౌలుకు ఇవ్వడానికి బహిరంగ వేలం నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రూ.1,000 ధరావత్తు చెల్లించి ని, వేలం పాటలో పాల్గొనాలన్నారు.

### అవకతవకలకు తావివ్వొద్దు

**పాములపాడు:** రేషన్ దుకాణాల్లో అవకతవకలకు తావివ్వకుండా ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ సుబ్రద్రమ్మ సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. జూన్1 నుంచి రేషన్ దుకాణాల నుంచి ప్రజలకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. దుకాణం వద్దకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. సరుకుల తూకాల్లో ఎలాంటి పొరపాట్లు ఉండరాదన్నారు. దుకాణంలో స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, సివిల్‌సప్లై డీటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

**కర్నూలు కల్చరల్:** రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 143 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 4వ సెమిస్టర్ పరీక్షలకు 1788 మందికిగాను 1645 మంది హాజరు కాగా 143 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

### జిల్లా స్థాయి హరి కథ, బుర్ర కథ పోటీలు

**డోన్ టౌన్:** పట్టణంలోని కొండపేటలో వెలసిన శాంభవి రేణుక ఎల్లమాంభేశ్వరి జ్యోతిర్లింగేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి జీవిత చరిత్రపై జిల్లా స్థాయి హరికథ, బుర్రకథ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు తెలిపారు. బుధవారం వార్షికోత్సవ కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న అమ్మవారికి వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హరికథ, బుర్రకథ పోటీల్లో పాల్గొన దలచిన బృందాలు గురువారం సాయిత్రం లోపు 8520852058 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని, 30న పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు వాయిద్య పరికరాలు వారే తెచ్చుకోవాలని, రవాణా చార్జీలు చెల్లించడంతో పాటు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

### చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

**నంద్యాల(న్యూటౌన్):** పిల్లలకు బాగా చదివిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టార్ సొసైటీ బుడగజంగాల పాఠశాల నిర్వాహకులు రాజేశ్వరమ్మ అన్నారు. బుధవారం ఆమె జిల్లాలోని ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె, బేతంచెర్లలోని బుడగ జంగాల కాలనీల్లో తిరిగి పిల్లలను తమ పాఠశాల హాస్టల్‌లో చేర్పించి చదివించాలని ప్రచారం చేశారు. వైఎస్సార్‌నగర్‌లో బుడగజంగాల పిల్లల కోసం ప్రత్యేకంగా హాస్టల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సుంకమ్మ, నాగలక్ష్మి, సుబ్బరాయుడు, బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు జమన్న, తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల అభివృద్ధికి విరాళం


హెచ్ఎం సుబ్బరాయుడికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**రుద్రవరం:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అదే పాఠశాలలో 2002 నుంచి 2007 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.60 వేలు విరాళం అందించారు. బుధవారం హెచ్ఎం సుబ్బరాయుడును కలిసి విరాళ నగదు అందించారు. ఈ నేపథ్యంలో హెచ్ఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు.

# యోగాతో మానసిక ప్రశాంతత


నందికొట్కూరులో యోగాసనాలు వేస్తున్న అధికారులు


కొత్తపల్లిలో..


బండిఆత్మకూరులో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

**బండి ఆత్మకూరు:** యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయుష్ డాక్టర్ నాగరాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జనార్ధన స్వామి ఆలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరితో పాటు మెడికల్ ఆఫీసర్‌లు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు. వీరితో ఆయుష్ డాక్టర్ నాగరాజు ఆసనాలు వేయించి, యోగా ప్రాముఖ్యత వివరించారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలన్నారు.

- **వెలుగోడు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఎంఈఓ బ్రహ్మం నాయక్, హెడ్మాస్టరు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. వీరితో ఆయుష్ డాక్టర్ సురేష్, యోగా మాస్టర్ నాగేశ్వరరావు యోగాసనాలు వేయించారు.
- **మహానంది:** యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మహానంది రైతుసేవా కేంద్రంలో సచివాలయ సిబ్బందితో పాటు స్థానికులకు యోగా ట్రైనర్లు నేతి రమేష్, గౌరీ, సహస్ర యోగాసనాలపై అవగాహన కల్పించారు.
- **నందికొట్కూరు:** పట్టణంలోని అమ్మవారి శాల కల్యాణం మండపంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ తదితరులు పాల్గొన్నారు.
- **జూపాడుబంగ్లా:** మోడల్ స్కూల్‌లో ఉద్యోగులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గంగాధర్, ఎంపీడీఓ గోపికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, యోగా ట్రైనర్లు అనూష, ప్రభావతి యోగాసనాల ప్రయోజనాలను వివరించారు.
- **కొత్తపల్లి:** మండల కేంద్రంలోని వెన్నెల గార్డెన్స్‌లో ఆయూష్ డాక్టర్ జమానుల్ల ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఏపీఓ విమలమ్మ, ఏఓ మహేష్, ట్రైనర్లు అన్నమ్మ, శైలజ పాల్గొన్నారు.
- **పాములపాడు:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో రెండో రోజు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్స్ శివకుమార్, మల్లీశ్వరీ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గాయత్రీ, ఆయుర్వేద వైద్యాధికారిణి సావిత్రి పాల్గొన్నారు.

# పడిపోతున్నా.. పట్టించుకోరా?

- ఒరిగిన విద్యుత్ స్తంభాలు



**కొత్తపల్లి:** ప్రభుత్వం ఏదైనా ప్రజలకు ఉపయోగపడే పనిచేస్తే నాణ్యతగా ఎక్కువకాలం ఉండేవిధంగా చేయాలి. అయితే కొత్తపల్లి మండలంలో అందుకు విరుద్ధంగా ప్రభుత్వం చేపట్టిన పనులు.. మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో నూతన విద్యుత్ లైన్లు వేస్తున్నారు. కొన్ని చోట్ల పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. కాగా ఎం.లింగాపురం నుంచి కొత్తమాడుగుల వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ స్తంభాలు కొద్ది రోజులకే ఒరిగి ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో పొలాల్లో వేలాడుతుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు ప్రమాదాలు చోటుచేసుకోక ముందే స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


లింగాపురం-కొత్తమాడుగుల రహదారిలో ఒరిగిన స్తంభాలు

## బాబ్బాబూ.. వేతనాలివ్వండి



బాబ్బాబూ.. దయచూసి వేతనాలివ్వండి అంటూ ఏ.కోడూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు జోలె పట్టి, చేతులు జోడించి అడుక్కోవడం చూస్తే అసలు ఈ ప్రభుత్వానికి మానవత్వమనేది ఉందా అనే అనుమానం కలగక మానదు. గత ప్రభుత్వంలోని సంక్షేమ పథకాల రద్దుతో చేతిలో చిల్లి గవ్వ లేని పేదలు ఆర్థిక పరిస్థితులతో అల్లాడిపోతున్నారు. కలోగంజో తాగి ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఇంతటి దుస్థితిలోనూ కూలీలకు రెండు నెలలైనా వేతనాలు ఇవ్వకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఇప్పటికైనా వేతనాలు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరుతూ బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దేవిడ్ ఆధ్వర్యంలో ఏ.కోడూరు గ్రామ ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలోనే కాసేపు నిరసన వ్యక్తం చేశారు.

– బండి ఆత్మకూరు